25

# పగ

అవంతీ దేశంలో అందమైన లోయ ఒకటి ఉండేది.

అయితే... ఆ లోయలో రాళ్ళూరప్పలూ ఎక్కువగా వుండి వ్యవసాయానికి అంతగా పనికి వచ్చేది కాదు. అక్కడ కొద్ది మంది ప్రజలు ఆ భూమిలోనే కాస్తంత వ్యవసాయం చేసుకుంటూ దుర్భరంగా బ్రతుకుతూ ఉండేవారు. వారి నాయకుడి పేరు... అడవిరాజు. అతనికి చాలామంది పిల్లలు. వారందరినీ పోషించలేక సతమతమవుతుండేవాడు అతను.

ఆ లోయలోనే ఒక చిన్న వాగు ఉంది. దాని ఒడ్డున సారవంతమయిన నేల ఉంది. అయినా...దాని జోలికి ఎవరూ పోయేవారు కాదు. ఎందుకంటే – ఆ ప్రాంతంలో భూమి లోపల పాతాళ లోకంలో ఒక మరుగుజ్జు జాతి వింత జీవులు నివసిస్తుండేవారు. వారు మంత్ర తంత్రాలలో ఆరితేరినవారు. మనుషులంటే విరుద్ధ భావం వున్నట్టివారు.

అడవిరాజుకు ఎలాగయినా ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలన్న ఆకాంక్ష అంతకంతకూ పెరగసాగింది. ఆ విషయమై ఆ లోయలోవుండే 'మంత్రాల మల్లయ్య'ను సలహా అడిగాడు.

అతడు ఒక ఆకు పసరును యిచ్చి, "మరుగుజ్జులుండే చోటికి వెళ్ళి కనురెప్పలో రాచుకుంటే నేల తెరుచుకొని వారి దగ్గరకు వెళ్ళే దారి దొరుకుతుంది" అని చెప్పాడు.

ఆ ప్రకారం చేసి అడవిరాజు – మరుగుజ్జుల నాయకుడుడైన 'తైలంగ్' దగ్గరకు వెళ్లాడు.

"ఈ భూమి వృథాగా ఉంది. దానిని నాకియ్యి.., పంటలు పండించి సగభాగం నీకిస్తాను" అన్నాడు అడవిరాజు.

ఆ సూచన తైలంగ్‌కు నచ్చింది. "సరే...మరి, వాటాలు ఎలా చేస్తావు?" అని అడిగాడు.



"మొదటి సంవత్సరం వేసిన పంటలో నేల పైభాగం నాది.., నేల లోపలి భాగం నీది. రెండవ సంవత్సరం- నేల లోపలి భాగం నాది.., పై భాగం నీది!" అన్నాడు అడవిరాజు మనసులో కుతంత్రంతో.

"సరే...అలాగే చేద్దాం! ఈ ఒప్పందం ఆరేళ్ళుండనీ. అవసరమైతే ఆ తర్వాత మార్చుకుందాం. పొలం సాగు చేయడంలో నేను కూడా నీకు సహాయం చేస్తాను" అన్నాడు తైలంగ్.

మర్నాడే భూమిని పదును చేయడం మొదలుపెట్టాడు అడవిరాజు.

తైలంగ్ కూడా సహాయపడ్డాడు. అతనొక్కడు ఇరవయి మంది చేసిన పని చేశాడు. అందువల్ల కొద్దిరోజుల్లోనే ఆ భూమి అంతా వ్యవసాయ యోగ్యమయింది.

మొదటి సంవత్సరం అడవిరాజు వరి పంట వేశాడు. పంట పుష్కలంగా పండింది.

ఒప్పందం ప్రకారం... నేల పైనున్న ధాన్యం, గడ్డీ కూడా అడవిరాజు పరం అయ్యాయి. పనికిరాని వేర్లు తైలంగ్‌కి దక్కాయి. అదే భాగ్యమనుకుని వాటిని తీసుకొని పొయ్యిలోకి వాడుకోసాగాడు.

రెండవ సంత్సరం చిలుగడ దుంపలను వేశాడు అడివిరాజు. సారవంతమైన తేమతో బ్రహ్మాండంగా పండింది పంట.

అయితే...ఒప్పందం ప్రకారం- నేలలోని దుంపలన్నీ అడవిరాజుకు వచ్చాయి. పైనున్న ఆకులూ, తీగలూ తైలంగ్‌కి వెళ్లాయి. వాటితోనే పప్పులు, పులుసులు చేసుకుని తృప్తిపడ్డాడు అతను.

ఈ విధంగా ప్రతీసారి తైలంగ్‌ను మోసం చేస్తూ.., తైలంగ్ కష్టానికి ప్రతిఫలం ఏమీ లేకుండా మొత్తం ఫలసాయం అంతా తానే అనుభవించసాగాడు అడవిరాజు.

తాను మోసగించబడుతున్నట్లు గ్రహించాడు తైలంగ్. కాని, ఒప్పందానికి కట్టుబడి కిమ్మకుండా ఉండిపోయాడు. ఒప్పందాన్ని కొనసాగించే సమయానికి జాగ్రత్తలు తీసుకోవచ్చని తనకి తాను సమాధానం చెప్పుకున్నాడు.

ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి. ఆ ప్రాంతానికంతటికీ ఎక్కువ సంపన్నుడయ్యాడు అడవిరాజు. పెద్దకోటను కట్టుకుని అనేకమంది హంగుదార్లను అందులో ఉంచాడు.

ఒప్పందం పూర్తి కావడంతో తైలంగ్‌ని శాశ్వతంగా దూరం చేయాలని కుతంత్రాలు పన్నసాగాడు అడవిరాజు. కోటలో ఒక కాళికాదేవి ఆలయం కట్టించి నిత్యపూజలు, భజనలు

తైలంగ్ జాతివారు కాళికాదేవి అంటే భయపడతారు. అందువల్ల ఆ చాయలకు రాకుండా దూరంగా వెళ్లిపోయాడు తైలంగ్. తనని నమ్మించి మోసం చేసిన అడవిరాజుపై అదను చూసి ప్రతీకారం తీర్చుకోవాలని నిశ్చయించుకున్నాడు.

అడవిరాజు తన కుమార్తె వివాహం అతి వైభవంగా చేశాడు.

ఆ వివాహానికి ఎక్కడెక్కడివారో హాజరయ్యారు. ఆ సమయంలో పెళ్ళికి వెళ్తున్న ఒక వ్యక్తి ద్వారా అడవిరాజుకి ఇమ్మని ఒక చిన్న పెట్టెను కానుకగా పంపించాడు తైలంగ్.

వింతగా ఉన్న ఆ చిరుకానుకను చేతిలోకి తీసుకుని అటూ ఇటూ చూశాడు అడవిరాజు. అది మెత్తగా, తడిగా, బరువుగా ఉంది. 'అది ఏమిటా..?' అని అందరూ దగ్గరకు వచ్చి విచిత్రంగా చూడసాగారు.

ఇంతలో... లోయలోని వాగు అకస్మాత్తుగా ఎండిపోయిందంటూ... ఒక పనివాడు వార్త తెచ్చాడు.

పెళ్ళి విందు అయ్యాక అక్కడికి పోయి చూడాలనుకున్నాడు అడవిరాజు. అతని మనుషులు అపరిచిత వ్యక్తి పంపిన ఆ వింత కానుకను తెరవసాగారు.

అడవిరాజు ఆ పెట్టెను కొంచెం తెరచీ తెరవగానే ఒక పెద్ద ఆనకట్ట పగిలిన శబ్దంతో ఆకాశగంగ భూమిపై దూకినట్లుగా పెద్ద వాగు అక్కడ విరుచుకుపడింది. ఈ ప్రవాహంలో అడవిరాజు, అతని మనుషులు కోటతో సహా కొట్టుకుపోయారు. నమ్మక ద్రోహానికి కలిగిన ఫలితం ఇది!

ఆ తర్వాత ఆ లోయంతా పెద్ద సరస్సులో మునిగిపోయింది. పడవలు ఆ సరస్సులో ఇప్పటికీ ప్రయాణం చేస్తుంటే ఇప్పటికీ అడుగున శిథిలమైన కోట, అస్థిపంజరాలూ కనిపిస్తుంటాయి.

★★★

